# సాక్షి తిరుపతి

బుధవారం। 27। నవంబర్। 2024




**ఘనంగా రాజ్యాంగ దినోత్సవం**

శ్రీకాళహస్తి మండలం, ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో



**విహంగామా!**

దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. - 8లో



**ఆరు గేదెలు మృతి**

కోట మండలం, గూడలిలో విద్యుత్ షాక్ ఆరు గేదెలు మృతిచెందాయి. రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. - 8లో

## న్యూస్‌రీల్

### సీఎం పర్యటనకు ఏర్పాట్లు



రేణిగుంట విమానాశ్రయంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

**చంద్రగిరి/రేణిగుంట:** సీఎం చంద్రబాబునాయుడు గురువారం తన తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు కర్మక్రియలకు విచ్చేయనున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. చిన్నపాటి లోపాలకు అవకాశం ఉండకూడదని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు హాజరయ్యేందుకు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబు నారావారిపల్లెకు రానున్నారన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున బందోబస్తు పక్కాగా ఉండాలని చెప్పారు. సమీక్ష అనంతరం నారావారిపల్లెలో ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను చంద్రగిరి ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీఓలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### భత్యాలు విడుదల

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల్లో 1 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రత్యేకావసరాల పిల్లలకు అన్ని రకాల భత్యాలను ప్రభుత్వం విడుదల చేసినట్లు డీఈఓ కేవీఎన్. కుమార్, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ డీ.రామచంద్రారెడ్డి తెలిపారు. ఎస్కార్ట్ భత్యం కింద 469 మందికి, రవాణా భత్యం కింద 598 మందికి, బాలికలకు సంబంధించిన స్టైఫండ్ భత్యం కింద 1,330 మందికి, ఇంటి వద్దనే అభ్యసం చేస్తున్న 340 మంది విద్యార్థులకు సంబంధించిన భత్యం మొత్తం రూ.68.81 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత మొత్తాన్ని వారి తల్లుల ఖాతాలో జమ చేస్తామని వారు తెలిపారు.

### లక్ష్యంతో చదవాలి



గోనుపల్లిలో మాట్లాడుతున్న డీఈఓ బాలాజీరావు

**రాపూరు:** లక్ష్యంతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు తెలిపారు. రాపూరు బాలికోన్నత పాఠశాల, గోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు కవిత పదో తరగతి విద్యార్థులకు అందించిన పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓలు శ్రీనివాసరావు, జిలానీ, హెచ్ఎం నాగేంద్రకుమార్, టీచర్లు గౌస్‌మోహిదీన్, పరంధామయ్య, విజయలక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం



ఎస్వీయూలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ, అధికారులు




తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



వేదిక్ వర్సిటీలో విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు



రాజ్యాంగ పీఠికను చదువుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్యానికి దిక్సూచి భారత రాజ్యాంగమని వక్తలు కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. దేశ ప్రజలకు రాజ్యాంగం పవిత్ర గ్రంథమని, పౌరులు రాజ్యాంగం పట్ల అగాహనతో పాటు విధేయత కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు ప్రదానం చేశారు. - తిరుపతి సిటీ/ తిరుపతి అర్బన్/ తిరుపతి క్రైం



నివాళి అర్పిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

# ప్రతిదానికీ సపరేటు



తిరుపతి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయివేటు వ్యక్తుల దందా కొనసాగుతోంది. వారు చెప్పిందే రేటు.. చేసిందే పనిగా చెల్లుబాటు అవుతోంది. సంబంధిత ఉన్నతాధికారులకు మామూళ్లు అందడంతో వారి పెత్తనం మూడు వెండర్లు.. ఆరు చలానాలుగా వర్ధిల్లుతోంది. ప్రతి దానికీ ఓ రేటు నిర్ణయించి వసూలు చేయడం సర్వసాధారణమైపోయింది. గత ప్రభుత్వ హయాంలో దళారులకు ముకుతాడు వేసినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను బ్రోకర్ల చేతిలో పెట్టడం విమర్శలకు తావిస్తోంది. సాధారణ, మధ్యతరగతి పేదలు ముడుపులు ఇచ్చుకోలేక అగచాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు

- ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- డాక్యుమెంట్ పీడీ, చలానా, ఈసీకి వారు అడిగినంత చెల్లించాల్సిందే
- మూగబోయిన టోల్ ఫ్రీ నంబర్
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నడుస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులు చెప్పిందే ఫైనల్ అనే చందంగా మారిపోతున్నాయి. జిల్లాలో 17 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. తిరుమలలోని రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం కేవలం వివాహాల రిజిస్ట్రేషన్ల కోసమే అన్నట్టు తయారైంది. మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివాహాలతో పాటు ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అయితే కార్యాలయల్లో అధికార సిబ్బంది కంటే.. దళారులు చెప్పినట్లు ఉన్నతాధికారులు నడుచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏం జరుగుతోందనే దానిపై 'సాక్షి' పరిశీలించింది. తిరుపతి, తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, నాయుడుపేట, గూడూరు కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లోనే క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు స్పష్టమైంది. రమణయ్య అనే వ్యక్తి తన ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వారం రోజులుగా తిరుగుతున్నాడు. నేరుగా అధికారుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యత్నించారు. అయితే అధికారులు రకరకాల కారణాలు చెప్పి వారం రోజులుగా తిప్పుకున్నట్టు రమణయ్య వాపోయాడు. చేసేది లేక దళారులను ఆశ్రయించాడు. జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తంతు.



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తిష్టవేసిన దళారులు



శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు



తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

### మూగబోయిన 1440

రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే వారి కోసం గత ప్రభుత్వం 1440 టోల్ ఫ్రీ నంబర్, సెంటర్లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటికి మంగళం పాడింది. ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్లలో ఉచితంగా ఈసీ, మార్కెట్ విలువ వంటి వివరాలు అందుబాటులో ఉండేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ఈసీ, మార్కెట్ విలువ కావాలని కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని అడిగితే.. దళారుల వద్దకు పంపుతారు. వారు రూ.200 నుంచి రూ.500 చొప్పున డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా డాక్యుమెంట్ పీడీ కావాలంటే రూ.500, చలానాకు రూ.300, ఈసీకి రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవైసీతో డాక్యుమెంట్ ఐదు నిముషాల్లో పూర్తి చేసి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెత్తనం మొత్తం బ్రోకర్ల చేతిలో పెట్టింది. దళారులు, ప్రైవేటు స్టాంప్ వెండర్లలో ఎక్కువ మంది అంతంత మాత్రం విద్యనభ్యసించిన వారే కావడం గమనార్హం.

**ప్రైవేటు వ్యక్తులు పనిచేయకుడదు**

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటు వ్యక్తులు పనిచేయకుడదని స్పష్టమైన ఆదేశాలున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా ప్రతి సబ్‌రిజిస్ట్రార్ పాటించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లోనూ నిఘా పెడుతాం. ఎక్కడైనా పనిచేస్తుంటే వారిని తొలగించేలా వెంటనే చర్యలు తీసుకుంటాం.

–శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి

# అల్పపీడనం.. అప్రమత్తం

- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదు
- ఈ నెల 28 వరకు భారీ వర్ష సూచన



**తిరుపతి అర్బన్:** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు జిల్లాకు భారీవర్ష సూచన ఉందన్నారు. ఈ క్రమంలో అధికారులు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లోని సమాచారాన్ని ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు లేదా జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం చోటుచేసుకోకుండా విపత్తును ఎదుర్కోవడానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు ఎవ్వరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఆదేశించారు. భారీ వర్షాలకు చెరువుల కరకట్టులు, కలుజులు, తూములు, వరద కాలువలు దెబ్బతినకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ శాఖల పరిధిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

| కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు | |
|---|---|
| కలెక్టరేట్ | 0877-2236007 |
| గూడూరు ఆర్డీఓ కార్యాలయం | 08624-252807 |
| సూళ్లూరుపేట ఆర్డీఓ | 08623-295345 |
| తిరుపతి ఆర్డీఓ | 7032157040 |
| శ్రీకాళహస్తి ఆర్డీఓ | 8555003504 |

# చెంగాళమ్మ చుట్టూ.. పేట రాజకీయం

- చైర్మన్ పదవి కోసం తమ్ముళ్ల పోటాపోటీ



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం

**సూళ్లూరుపేట :** సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయం శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం చుట్టూ తిరుగుతోంది. ఆలయ పాలకమండలి పదవి ఎవరికి దక్కుతుందోనని చర్చ జోరందుకుంది. ఈ ఆలయానికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే కాకుండా ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ ప్రత్యేక స్థానముంది. ఆలయ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. సూళ్లూరుపేట టీడీపీలో రెండు వర్గాలుగా రాజకీయాలు నడుస్తున్నాయి. ఆయా వర్గాల నుంచి ఆశావహులు తమ అధినాయకులను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మంచి పట్టున్న ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఆశీస్సులున్న వారికే చైర్మన్ పదవి దక్కుతుందనే చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆమె తండ్రి నెలవల సుబ్రమణ్యం కూడా కొండేపాటితో సఖ్యతగా ఉండడంతో వీరి అండదండలున్న వారికే చైర్మన్ గిరి వరిస్తుందని ప్రచారం జోరందుకుంది. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనాయణరెడ్డి, మరో మంత్రి నారాయణ సహకారంతో చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. వీరితోపాటు గత ప్రభుత్వంలో రెండు సార్లు చైర్మన్ పదవిని అనుభవించి, ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి కాచుకు కూర్చున్న దువ్వూరు బాలచంద్రారెడ్డి కూడా గంపెడాశలు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఆయన తన సతీమణికి చైర్మన్ పదవి కేటాయించమని అభ్యర్థిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# పత్రికల్లోనే కూటమి అభివృద్ధి

- కక్ష సాధింపు చర్యలు మానుకోండి
- చిరుద్యోగుల జోలికి వెళితే ఊరుకోం
- నిత్యావసర నరుకుల ధరలు అదుపు చేయండి
- కలెక్టరేట్ వద్ద కార్మికులు, రైతు సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగారావు

**తిరుపతి అర్బన్:** కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికల్లోనే అభివృద్ధి కనిపిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగారావు ఎద్దేవా చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు, రైతు సంఘాల నేతలతో కలసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. జాతీయ నేతల పిలుపు మేరకు ఈ ధర్నా చేపట్టినట్టు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు రాజకీయరంగు పులమడం శాంతిభద్రతలకే ప్రమాదమని హెచ్చరించారు. ఒక్కసారిగా వారంతా పోరాటాలు చేస్తే ప్రభుత్వాలు తలకిందులు కావడం ఖాయమన్నారు. ఇకపై వారికి జోలికి వెళితే ఊరుకోమని హెచ్చరించారు.

**ఒక్క పరిశ్రమా లేదు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క కొత్త పరిశ్రమ రాలేదని వామపక్ష నేతలు విమర్శలు ఎక్కుపెట్టారు. పాత పరిశ్రమల్లోనే మళ్లీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే పత్రికల్లో మాత్రం భలే అభివృద్ధి జరుగుతున్నట్లు కూటమి సర్కార్‌ను కొనియాడడం విడ్డూరంగా ఉందన్నారు.

**రాజకీయ వేధింపులు మానుకోండి**

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న బాబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద వెటర్నటీకి చెందిన ఉద్యోగులు న్యాయం కోసం ధర్నా చేపట్టారు. వారికి సీఐటీయూ, ఆప్కాస్ నేతలు మద్దత్తు తెలిపారు. 2019 నుంచి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను అకారణంగా తొలగించడం ఏమంటని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఉద్యోగులు హేమంత్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, లోకేష్, కిరణ్, లలిత, శ్రవంతి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఇలాగే ఐదేళ్లు గడిపేస్తారా?**

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడానికే సమయం వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఏం చేయలేదంటూ ఐదేళ్లు గడిపేస్తారా..? అంటూ నిలదీశారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నప్పటికి విభజన హామీలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, లేకుంటే సూపర్‌సిక్స్‌పై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు భారతి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, రైతు సంఘం జిల్లా నేత మాగంటి గోపాల్‌రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు.

**సూపర్ సిక్స్ ఎప్పుడు బాబూ?**

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటంటే ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకపోవడం ప్రభుత్వం చేతగానితనంగా నేతలు పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం తొలి సంతకం పేరుతో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారని, అయితే ఇప్పటికీ అందులో స్పష్టత లేదన్నారు. ఓ వైపు విద్యుత్ చార్జీలను పెంచడం, మరోవైపు నిత్యావసర ధరలు పెరడంతో సామాన్యుడి జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.



పెరిగిన నిత్యావసరాల ధరలను చూపుతూ నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

## క్లుప్తంగా

### మహిళ అదృశ్యం


వరలక్ష్మి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన పి.వరలక్ష్మి(35) అదృశ్యమైంది. ఆమె భర్త హరికుమార్ కథనం మేరకు.. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వరలక్ష్మి ఆ తర్వాత ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9182492884, 9441716259 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

### కానిస్టేబుల్‌కు ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్ బౌన్స్ కేసులో 2019లో అలిపిరి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పీ.లాల్‌ఖాన్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎస్పీ అర్బన్ ఆఫీసులో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న ఎం.మోహన్‌రెడ్డి వద్ద లాల్‌ఖాన్ 2019 డిసెంబర్ మూడో తేదీ రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని ప్రో నోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము అతను తిరిగి చెల్లించకపోవడంతో మోహన్‌రెడ్డి నోటీసు ఇచ్చాడు. దీంతో లాల్‌ఖాన్ 2021 ఆగస్టు 15వ తేదీ చెక్కును మోహన్‌రెడ్డికి ఇచ్చాడు. ఆ చెక్కును అతను 2021 ఆగస్టు 31వ తేదీ బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయ్యింది. దీంతో అతను లాల్‌ఖాన్ పై కోర్టులో చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి లాల్ ఖాన్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

### రైలు కిందపడి యువకుడి మృతి


పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతదేహం

రేణిగుంట: రేణిగుంట-ఏర్పేడు రైలు మార్గంలో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రేణిగుంట జీఆర్పీ ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలు... రేణిగుంట- ఏర్పేడు మధ్యలో గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని సుమారు 28 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు మృతి చెందాడు. మృతుడు గ్రే మెరూన్ కలర్ డ్రాయర్, ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు రేణిగుంట రైల్వే పోలీస్ 9963126343 నంబర్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

### రూ.44కోట్లు విడుదల

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ నుంచి ఎస్వీయూకు రూ.44 కోట్లు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో గత రెండు మాసాలుగా వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్సిటీ శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులకు, పెన్షనర్లకు ఊరట లభించినట్లయింది.

# ఏం సందేశం ఇస్తున్నావు అధ్యక్షా?

- పోలీసులతో గూడూరు ఎమ్మెల్యే రహస్య మంతనాలు
- రౌడీయిజం చేస్తే కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు
- ఆపై రౌడీలను ప్రోత్సహించే విధంగా కార్యకలాపాలు
- విస్తుపోతున్న స్థానికులు!


తన ఇంట్లో పోలీసులతో రహస్యంగా సమావేశమైన గూడూరు ఎమ్మెల్యే

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు ఎమ్మెల్యే తీరు స్థానికులను విస్మయానికి, గందరగోళానికి దారితీస్తోంది. ఆయన పోలీసులతో రహస్య సమావేశాలు నిర్వహించి రౌడీయిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఆదేశిస్తున్నారు. సభలు సమావేశాల్లోనూ రౌడీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఆపై రౌడీ షీటర్ల పుట్టిన రోజు వేడుకలు, వారి ఇళ్లల్లో జరిగే శుభకార్యక్రమాలకు వెళ్తూ వారిని మరింత ప్రోత్సహించే రీతిలో వ్యవహరిస్తున్నారు. పోలీసులు కూడా ఏమి చేయాలో దిక్కుతోచక రౌడీ షీటర్లతో సఖ్యతగా ఉంటున్నారు. వారికి ప్రతి పనిలోనూ సహకారం అందిస్తూ వస్తున్నారు. ఐడీ కానిస్టేబుళ్లు అయితే రౌటీ షీటర్ల అనుచరులతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడం చర్చనీయాంశమైంది.

**పట్టించుకుంటే ఒట్టు**

నియోజకవర్గంలోనే కాకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎక్కడ హత్యలు జరిగినా దానికి కేంద్ర బిందువుగా గూడూరులోని రౌడీ షీటర్ల హస్తం ఉన్నట్లు విచారణలో తేలుతోంది. గూడూరుకు చెందిన ఓ రౌడీషీటర్ చిల్లకూరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై పబ్లిక్‌గా దాబా నడుపుతున్నారు. అక్కడ పలు అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నా పోలీసులు ఆ ప్రాంతం వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. గతంలో గూడూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిలో దాబాకు ఎలా అనుమతులు మంజూరు చేస్తారంటూ డివిజన్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీన్ని మనసులో పెట్టుకుని సదరు వ్యకిపై బెదింపులకు దిగి ఫిర్యాదును ఉప సంహరించుకునేలా చేశారు. అదే రౌడీ షీటర్ దాబా వద్ద తనతో పాటుగా తిరుగుతున్న ఓ యువకుడ్ని వారం రోజుల క్రితం తన అనుచరులతో కలసి హత్య చేశారు. ఆపై వాకాడు ప్రాంతంలో శవాన్ని పారేశారు. ఇదంతా చూస్తుంటే ప్రజాప్రతినిధుల నుంచి వీరికి ఎంత మద్దతు ఉందో అర్థం చేసుకోవచ్చు. గూడూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒక ఏడాదిలో ఇన్ని హత్యలు, రౌడీయిజం, అక్రమాలు లాంటి దారుణాలు చోటు చేసుకున్న దాఖలాలు లేవని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### ఇసుక డంప్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

నారాయణవనం: మండలంలోని పాలమంగళం సౌత్ దళితవాడ సమీపంలో మంగళవారం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ స్థానిక పోలీసులతో కలిసి ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ముందస్తు సమాచారంతో పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పుత్తురు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేకర్‌తో కలిసి పాలమంగళం సౌత్ దళితవాడ శ్మశాన వాటిక సమీపంలో ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. సుమారు రూ.6 లక్షల విలువైన 40 టన్నుల ఇసుకను పంచనామ నిర్వహించి తహసీల్దార్‌కు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని అరుణానది నుంచి ఇసుకను తరలించడానికి ప్రభుత్వం అనుమతులు లేవన్నారు. ఇసుక డంప్ చేసిన స్థల యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పారు.

# లక్షలు ఇస్తే.. పోస్టులిప్పిస్తాం!

- వర్సిటీపై దళారుల పంజా
- తాత్కాలిక అధ్యాపకులు, నిరుద్యోగులే టార్గెట్
- ఒప్పంద అధ్యాపక పోస్టులు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో డిమాండ్


ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో దళారులు రెచ్చిపోతున్నారు. వర్సిటీ అధికారులతో తమకు పరిచయాలు ఉన్నాయంటూ కొందరు, రాష్ట్ర స్థాయిలో మంత్రులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న మరికొందరు నిరుద్యోగులను, ప్రస్తుత అకడమిక్ కన్సల్టెంట్లను వలలో వేసుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీకి చెందిన బయట వ్యక్తులు, వర్సిటీలో పనిచేస్తున్న ఆ పార్టీ అనుచరులుగా గుర్తింపు పొందిన కొందరు వ్యక్తులు నిరుద్యోగులతో బేరసారాలు జరుపుతూ లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు వర్సిటీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

**జీవో 115 ప్రకారం కొనసాగించండి**

వర్సిటీలో ప్రస్తుతం ఉన్న సుమారు 260 మంది అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 110 జీవో అమలుకు నోచుకోకపోవడంతో వర్సిటీలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకుల సర్వీసు పొడిగించకుండా అధికారులు నిలిపివేశారు. దీంతో వారు ఇంటి ముఖం పట్టడం తప్ప వేరే దారిలేదు. కానీ గత ఐదేళ్లుగా పనిచేస్తున్న తమకు 115జీవో ప్రకారం శాశ్వత నియామకాలు జరిగే వరకు కొనసాగించేందుకు అవకాశం ఉందని వారు వాపోతున్నారు.

**ఒక్కో పోస్టుకు రూ.15 లక్షలు పైనే డిమాండ్**

డిసెంబర్‌లో ఒప్పంద అధ్యాపక నియామకాల నోటిఫికేషన్ విడుదల కానున్న తరుణంలో అధికార పార్టీ నాయకులు దళారీ అవతారమెత్తి ఆశావహుల నుంచి ఒక్కో పోస్టుకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆశావాహులు విజయవాడ వేదికగా తమకు పరిచయమున్న అధికార పార్టీ నాయకులతో సంప్రదింపులు జోరందుకున్నట్లు తెలిస్తోంది.

**ఆరోపణలు అవాస్తవం**



నోటిఫికేషన్‌పై ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వర్సిటీలో ప్రతి విభాగంలో ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో అవసరం మేరకు అధ్యాపకుల ఖాళీలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈసీ సమావేశంలో పెట్టి ఆమోదించిన తర్వాత నిబంధనల ప్రకారమే నోటిఫికేషన్ విడుదలకు ప్రయత్నిస్తాం. ఇందులో ఎటువంటి దళారీ వ్యవస్థకు చోటు లేదు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కా పాటించడం జరుగుతుంది.

–ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

# పనుల పురోగతిపై సమీక్ష


నిర్మాణంలో ఉన్న నూతన పీఏసీ-5 భవన

తిరుమల: తిరుమలలో టీటీడీ నిర్మిస్తున్న నూతన యాత్రికుల వసతి సముదాయం (పీఏసీ-5) భవన నిర్మాణ పనుల పురోగతిపై టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్యచౌదరి మంగళవారం అన్నమయ్య భవన్‌లో అధికారులతో సమీక్షించారు. అనంతరం అడిషనల్ ఈఓకు నిర్మాణ పనుల స్థితి గురించి ఇంజినీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా 16 హాళ్లలో 8 హాళ్లలో ఫ్లోరింగ్ పూర్తయిందని, మిగిలిన పని చేయాల్సి ఉందని చెప్పారు. అదేవిధంగా పీఏసీ-5లో భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న అన్న ప్రసాదం డైనింగ్ హాల్, కల్యాణ కట్ట, డిస్పెన్సరీ సదుపాయాలపై అధ్యయనం చేశారు. డిప్యూటీ ఈఓలు రాజేంద్ర, భాస్కర్, వెంకటయ్య, ఆశాజ్యోతి, ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, ఈఈలు వేణుగోపాల్, సుధాకర్, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, అశ్విని ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,637 మంది స్వామివారిని దర్శించుకోగా 24,016 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.2 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# ఉమర్ ఫరూక్ అవశేషాలు లభ్యం!


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల: విద్యుత్ షాక్‌తో మృతిచెందిన మండలంలోని ఉమర్ ఫరూక్ అవశేషాలను పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం.. పాకాల పట్టణానికి చెందిన ఉమర్ ఫరూక్ ఆరు నెలల క్రితం మండలంలోని పంటపల్లెలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగులుకుని మృతి చెందాడు. ఆపై అతని మృతదేహాన్ని కౌలు రౌతు మోహన్‌రెడ్డి గుట్టుచప్పుడు కాకుండా ఊరికి దూరంగా పడేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం సీఐ మద్దయ్య ఆచారి, క్లూజ్ టీం అధికారులతో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కరెంటు షాకుతో ఉమర్ ఫరూక్(35) మృతి చెందాడని, అతని మృతదేహాన్ని తన భార్య సహకారంతో కొంత దూరంలో ముళ్లపొదల్లో పడేసినట్లు నిందితుడు మోహన్‌రెడ్డి విచారణలో ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహానికి సంబంధించిన అవశేషాలను క్లూజ్ టీం అధికారులు సేకరించారు. అనంతరం వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. నిందితుడు మోహన్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి రూరల్: మండల పరిధిలోని ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రచించిన రాజ్యాంగాన్ని గ్రామస్తులు ఆమోదించారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదిరి పాఠశాల రాజ్యాంగ పరిషత్‌ను నిర్వహించారు. ఇందులో 193 మంది విద్యార్థులు రాజ్యాంగ పరిషత్ సభ్యులు లాగా హాజరయ్యారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, ఆదేశ సూత్రాలు, కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన, భాషలు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ ప్రవేశికను సామూహిక పఠనం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా రాజకుమారి, పాఠశాల రాజ్యాంగ రచనా సంఘం చైర్మన్ గా కూనాటి సురేష్, హక్కుల కమిటీ చైర్మన్‌గా రమేష్‌బాబు, విధుల కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసులు, అధికారాల కమిటీ చైర్మన్‌గా మురళి, విధివిధానాల కమిటీ చైర్మన్‌గా రజియా, మైనారిటీ, వెనుకబడిన తరగతుల కమిటీ చైర్మన్‌గా మల్లికార్జున, ఆర్థిక కమిటీ చైర్మన్‌గా శాంతి, ఇతర కమిటీలకు చైర్మన్‌లుగా సుమతి, బిందు వ్యవహరించారు. అదే విధంగా రాచగున్నేరి పాఠశాలలో సర్పంచ్ డాక్టర్ భార్గవి, మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథంనాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.



# వెటర్నరీలో జాతీయ పాల దినోత్సవం


బహుమతులందుకున్న విద్యార్థులతో అధికారులు

తిరుపతి సిటీ: ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐడీఏ-ఏపీ) తిరుపతి చాప్టర్, వెటర్నరీ వర్సిటీ కాలేజ్ ఆఫ్ డెయిరీ టెక్నాలజీ సంయుక్తంగా మిల్క్ మ్యాన్‌గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ పాల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. డెయిరీ టెక్నాలజీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'రైతులు, గ్రామీణ మహిళలకు సాధికారత' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. డీన్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, డాక్టర్ వై.రవీంద్రారెడ్డి, డాక్టర్ మంజునాథ పాల్గొన్నారు.

# పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీతో పాటు పలు పీజీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఉన్నత విద్యా మండలి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పీజీ సెట్-2024 అర్హత సాధించని విద్యార్థులు, సెట్‌కు పరీక్షలు రాయని విద్యార్థులు సైతం ప్రవేశం పొందేందుకు వెసులుబాటు కల్పించింది. స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు. త్వరలో వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు.

### విద్యుత్‌షాక్‌తో ఆరు గేదెల మృతి

కోట: విద్యుత్ షాక్‌తో ఆరు గేదెలు మృతి చెందిన ఘటన మంగళవారం కోట మండలం, గూడలిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గూడలిలో రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న క్రమంలో టిప్పర్ ద్వారా కంకర తరలిస్తుండగా దానికి 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో వైరు తెగి రోడ్డుపై పడింది. అదే సమయంలో రోడ్డుపై ఆరు గేదెలు వెళ్తుండడంతో అవి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.4 లక్షలని బాధితుడు వాపోయాడు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

# అమ్మో పాము!


పట్టుబడిన పామును చూపిస్తున్న భాస్కర్ నాయుడు

తిరుమల: తిరుమలలో మంగళవారం 8 అడుగుల నాగుపాము స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బీ-టైపు 23వ క్వార్టర్స్ ప్రాంతంలో నాగుపాము వచ్చింది. స్థానికులు టీటీడీ ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు చాకచక్యంగా పామును పట్టుకు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు.

# వదంతులు..అగచాట్లు!


రేణిగుంటలో పోస్టాఫీసుకు క్యూ కట్టిన మహిళలు

రేణిగుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ పోస్ట్ ఆఫీస్‌లో అకౌంటు ఉన్న మహిళలకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని వస్తున్న వదంతులతో మహిళలు స్థానిక పోస్టాఫీసు కార్యాలయానికి క్యూ కట్టారు. మంగళవారం రేణిగుంట పోస్ట్ ఆఫీస్‌లో వ్యక్తిగత ఖాతాలు తెరిచేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారు ఆధార్, ఫోన్ నంబర్ లింక్ చేసుకుంటే సరిపోతుందని అధికారులు చెప్తున్నారు. అయితే కచ్చితంగా పోస్ట్ ఖాతా ఉండాలని పుకార్లు రావడంతో మహిళలు అయోమయంలో పడుతున్నారు. దీనిపై అధికారులు సరైన సమాచారం ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు.

# వృద్ధుడి మృతి

పాకాల: ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని సామిరెడ్డిపల్లి పంచాయతీ, తోటపల్లి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి(85) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం విషం తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తిరుపతి రుయాకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# విహంగామా!

- కిటకిటలాడిన నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం
- తండోపతండాలుగా తరలివచ్చిన విద్యార్థులు
- అవగాహన కల్పించిన ఫారెస్ట్ సిబ్బంది



దొరవారిసత్రం: విదేశీ విహంగాల కిలకిల రావాలు, చిలిపి చేష్టలు, ఈత కొట్టడాలు పక్షి ప్రేమికులను కట్టిపడేశాయి. బంగాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వీపరీతమైన చలిగాలులు, చినుకులు పడుతున్నా ఇవేవీ లెక్కచేయకుండా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మంగళవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అక్కడ విడిది చేసే విదేశీ శీతాకాలపు విహంగాలను తిలకించి ఉప్పొంగిపోయారు. తిరుపతి, చిత్తూరు, గూడూరు, నెల్లూరు పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పక్షుల కేంద్రానికి విచ్చే.. కడప చెట్లపై విడిది చేసే విహంగాలను బైనోక్యులర్స్ ద్వారా వీక్షించారు. ప్రస్తుతం గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, తెల్ల కంకణాయిలు, నీటికాకులు తదితర పక్షులు పిల్లలు పొదిగి కిలకిలరావాలు, కేరింతలు కొడుతున్నాయి. వీటి చేష్టలు వీక్షకుల కళ్లు తిప్పనివ్వలేదు. గూడబాతుల విన్యాసాలు, ఈత కొడ్డటం పక్షి ప్రేమికులను కట్టిపడేశాయి. విహంగాల ప్రత్యేకత, వాటి ప్రాధాన్యత గురించి చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్లు వద్ద నేచర్ గైడ్ హుస్సేన్, ఫారెస్ట్ సిబ్బంది అవగాహన కల్పించారు.




పక్షుల కేంద్రంలో పిల్లలను పొదిగి ఉన్న గూడ బాతులు